TGTEL/25/A1907

# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక

సంపుటి: 02 సంచిక : 55 ఎడిటర్ : సింగిడి అమృత్, తెలంగాణ శనివారం.26.09.2026 పేజీలు : 8, వెల:రూ.2.00

PUBLISHED FROM ADILABAD,NIRAML,MANCHIRAL,KOMARAMBHEEM, ASIFABADKARIMNAGAR,JAGITIYALA,PEDAPALLI,JAI SHANKA BHUPALLI, NIZAMABAD,KAMAREDDY,MEDCHEL,HYDERABAD

## రష్యా ఎన్నికల్లో పుతిన్ రికార్డు విక్టరీ- 450 స్థానాలకుగాను 349 స్థానాలు కైవసం

### పదేళ్లలో తొలిసారిగా 60 శాతానికి పైగా పోలింగ్ నమోదు- ఎన్నికల వేళ రష్యాపై 1110 డ్రోన్లతో విరుచుకుపడ్డ ఉక్రెయిన్

రష్యా, అమృత్ తెలంగాణ: రష్యా పార్లమెంటరీ ఎన్నికల తుది ఫలితాలు వెలువడ్డాయి. ఊహించినట్లుగానే ఈ ఎన్నికల్లో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన 'యునైటెడ్ రష్యా' పార్టీ ఏకపక్ష విజయం సాధించింది. ఉక్రెయిన్‌పై యుద్ధం ప్రారంభించిన తర్వాత జరిగిన తొలి ఎన్నికలు కావడంతో వీటిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎన్నికల సమయంలో ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు పాల్పడినా పోలింగ్ మాత్రం రికార్డు స్థాయిలో నమోదైంది.

450 స్థానాలకు గాను 349 స్థానాలు కైవసం

రష్యా దిగువ సభ 'స్టేట్ డూమా' ఎన్నికల్లో క్రెమ్లిన్ ఆధిపత్యం మరోసారి నిరూపితమైంది. మూడు రోజుల పాటు జరిగిన ఈ ఎన్నికల తుది ఫలితాలను కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం విడుదల చేసింది. మొత్తం 450 స్థానాలకు గాను పుతిన్ నేతృత్వంలోని 'యునైటెడ్ రష్యా' పార్టీ ఏకంగా 349 స్థానాలను కైవసం చేసుకుని మూడొంతుల మెజారిటీ సాధించింది. ఆ పార్టీకి రికార్డు స్థాయిలో 58 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం 11 కోట్లకుపైగా ఓటర్లలో దాదాపు 60 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత పదేళ్లలో రష్యా పార్లమెంటరీ ఎన్నికల్లో ఇంత భారీ పోలింగ్ నమోదు కావడం ఇదే తొలిసారి. పోలింగ్ శాతాన్ని పెంచేందుకు మూడు రోజుల పాటు ఆఫ్‌లైన్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఆన్‌లైన్ ఓటింగ్‌కు కూడా అవకాశం కల్పించారు.

ఈ ఎన్నికల్లో బలమైన ప్రతిపక్షం లేకుండా పుతిన్ ప్రభుత్వం ముందుగానే జాగ్రత్త పడింది. యుద్ధాన్ని బహిరంగంగా విమర్శించిన ఏకైక లిబరల్ పార్టీ 'యాబ్లోకో'ను సుప్రీంకోర్టు గత నెలలోనే ఎన్నికల బరిలో లేకుండా చేసింది. ప్రభుత్వానికి మద్దతు పలికే 'సిస్టమిక్ అపోజిషన్'కు చెందిన పలు చిన్న పార్టీలు 97 స్థానాలు గెలుచుకోగా, మిగిలిన నాలుగు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రకటించిన తర్వాత జరిగిన తొలి ఎన్నికలు ఇవే కావడం గమనార్హం. మాస్కో ఆక్రమించుకున్న నాలుగు ఉక్రెయిన్ ప్రాంతాలతో పాటు 2014లో విలీనం చేసుకున్న క్రిమియాలోనూ రష్యా పోలింగ్ నిర్వహించింది. దీన్ని ఉక్రెయిన్ తీవ్రంగా ఖండించింది. అయినప్పటికీ ఈ ఘనవిజయం తమ విధానాలకు ప్రజల మద్దతుకు నిదర్శనమని అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు.

మాస్కోలో డ్రోన్ దాడుల కారణంగా ముగ్గురు మృతి, 38 మందికి గాయాలు



మరోవైపు ఈ ఎన్నికలకు ఆటంకం కలిగించేందుకు ఉక్రెయిన్ తీవ్రంగా ప్రయత్నించింది. పోలింగ్ సమయంలో రష్యాపై భీకర డ్రోన్ దాడులకు పాల్పడింది. ఆదివారం రాత్రి ఏకంగా 1,110 డ్రోన్లను రష్యా సైన్యం కూల్చివేసింది. రాజధాని మాస్కోపై ఏకంగా 450 డ్రోన్లతో దాడి చేయగా వాటిని గాల్లోనే అడ్డుకున్నట్లు మాస్కో మేయర్ తెలిపారు. మాస్కోపై ఇదే అతిపెద్ద దాడి అని ఆయన పేర్కొన్నారు. డ్రోన్ దాడుల కారణంగా ఒక చమురు శుద్ధి కర్మాగారంతో పాటు ఒక నివాస భవనం దెబ్బతింది. మాస్కో పరిధిలో ముగ్గురు పౌరులు మరణించగా, 38 మంది గాయపడ్డారు. ఉక్రెయిన్ కాల్పుల కారణంగా ఆరుగురు పోలింగ్ సిబ్బంది మృతి చెందారని, 75 పోలింగ్ కేంద్రాలు ధ్వంసమయ్యాయని రష్యా ఎన్నికల సంఘం వెల్లడించింది.

ఇదిలా ఉండగా, ఈ ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా జరగలేదని పశ్చిమ దేశాలు విమర్శిస్తున్నాయి. ఎన్నికల ప్రక్రియను పూర్తిగా నియంత్రించారని, పుతిన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బలమైన ప్రతిపక్షాలు పోటీలో లేకుండా చేశారని ఆరోపిస్తున్నాయి. ముఖ్యంగా యుద్ధానికి వ్యతిరేకంగా 'శాంతి, స్వేచ్ఛ' అనే నినాదంతో పోటీలోకి దిగాలని భావించిన లిబరల్ పార్టీ 'యాబ్లోకో'ను కావాలనే పోటీ నుంచి తప్పించినట్లు దుయ్యబట్టాయి. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిందన్న సాకుతో రష్యా సుప్రీం కోర్టుతో ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆ పార్టీని నిషేధించేలా చేశాయని మండిపడ్డాయి.

## 'జ్ఞానేశ్ తీసుకున్న నిర్ణయాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాలి'- సీఈసీకి వ్యతిరేకంగా సుప్రీంలో పిటిషన్

న్యూఢిల్లీ, అమృత్ తెలంగాణ: సర్ వివాదం వేళ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో నిబంధనలు ఉల్లంఘించారని ఆయనపై క్రిమినల్ విచారణ కోరుతూ న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి పిటిషన్ దాఖలు చేశారు. ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా జ్ఞానేశ్ కుమార్ తీసుకున్న నిర్ణయాలు, జారీ చేసిన మార్గదర్శకాలు, చేపట్టిన సాఫ్ట్‌వేర్ మార్పులన్నీ రాజ్యాంగ విరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. సర్‌కు సంబంధించిన నిర్ణయాలు చట్టవిరుద్ధమని ప్రకటిస్తూ 'ఫామ్-6'ను పునరుద్ధరించాలని అభ్యర్థించారు. సర్ ప్రక్రియ సమయంలో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది పేర్లను ఎన్నికల జాబితా నుంచి తొలగించారన్న ఆరోపణలున్నాయని, వాటిపై సిట్‌తో దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు.







ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం విధుల నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినందుకు గానూ జ్ఞానేశ్ కుమార్‌తో పాటు, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ మనీశ్ గార్గ్, ఈసీ ఐటీ హెడ్ సీమా ఖన్నాపై క్రిమినల్ విచారణ జరపాలని పిటిషన్లో పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల చట్టం- 2023లోని నిబంధనలను ముఖ్యంగా సెక్షన్ 18ను ఆధారంగా పిటిషన్ దాఖలు చేశారు. ఈ సెక్షన్ ప్రకారం ఎన్నికల కమిషన్ ద్వారా నిర్ణయాలు తీసుకునే అధికారం ఉందని, ఒకవేళ అభిప్రాయ భేదం ఉన్నప్పుడు మెజారిటీ అభిప్రాయానికే ప్రాధాన్యం ఉంటుందని పేర్కొంటుంది.

"ఏ విధమైన చట్టబద్ధమైన లేదా రాజ్యాంగపరమైన రక్షణ లేకుండా సీఈసీ కూడా ఒక సాధారణ నిందితుడిలాగే పోలీసు విచారణ, సాక్ష్యాధారాల సేకరణ, సాధారణ విచారణ ప్రక్రియలకు లోబడి, చట్టం ప్రకారం నేరుగా జవాబుదారీగా ఉంటారు. పూర్తి కమిషన్ ఏకాభిప్రాయం లేకుండా లేదా ఎన్నికల కమిషనర్ల మెజారిటీ అభిప్రాయానికి విరుద్ధంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా, అధికార పరిధిని మించినవిగా, చెల్లనివిగా ప్రకటిస్తూ మాండమస్ రిట్ లేదా మరేదైనా తగిన రిట్, ఉత్తర్వు లేదా ఆదేశం జారీ చేయాలి." అని పిటిషన్‌లో పేర్కొన్నారు.

దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు

ఇదిలా ఉండగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ను తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆదేశాల మేరకు అన్ని రాష్ట్రాల్లో ఎన్నికల సంఘ కార్యాలయాలను ముట్టడించారు. జమ్మూ కాశ్మీర్, అసోం, ఉత్తరాఖండ్, బంగాల్, ఉత్తర్ ప్రదేశ్, చండీగఢ్, మణిపుర్ తదితర రాష్ట్రాల్లో కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు. పీసీసీ కార్యాలయాల నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయాల వైపు ర్యాలీగా వెళ్తూ సీఈసీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మణిపుర్లో జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్టు చేయాలని నినాదాలు చేస్తూ ఆయన దిష్టిబొమ్మను కూడా దహనం చేశారు. ఈ క్రమంలోనే ఆందోళనకారులు- పోలీసుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ నిరసన హింసాత్మకంగా మారడంతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. అటు పార్లమెంటు ఉభయ సభల్లోనూ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్ష పార్టీలు అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టే అవకాశం ఉందని కాంగ్రెస్ ప్రకటించింది. సెప్టెంబర్ 29న దిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

జ్ఞానేశ్ కుమార్ను తొలగించాలని విజయన్ డిమాండ్

మరోవైపు కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సైతం సీఈసీ జ్ఞానేశ్ కుమార్ను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఓటర్ల జాబితా 'ప్రత్యేక సమగ్ర సవరణ' ప్రక్రియను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. సర్ ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు లేవనెత్తిన అభ్యంతరాలు భారత ఎన్నికల కమిషన్ పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలను రేకెత్తించాయని ఎక్స్లో పేర్కొన్నారు. ఓటు అనేది భారత ప్రజల హక్కని, బీజేపీ, సంఘ్ పరివార్ రాజకీయ ప్రయోజనాల కోసం దీనిని తారుమారు చేయకూడదని తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన ఖైరతాబాద్ గణపతి నిమజ్జనం

హైదరాబాద్, అమృత్ తెలంగాణ: హైదరాబాద్ నగరంలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఖైరతాబాద్ మహా గణపతి నిమజ్జన వేడుకలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ ఏడాది ఏకంగా 69 అడుగుల భారీ ఎత్తుతో 'పంచముఖ సంకటహర మహాగణపతి' రూపంలో భక్తులకు కనువిందు చేసిన గణనాథుడిని, వేలాది మంది భక్తుల జైత్రయాత్ర మధ్య హుస్సేన్‌సాగర్‌కు తరలించారు. భక్తుల భక్తిశ్రద్ధలు, జయజయధ్వానాల నడుమ సాగిన ఈ శోభాయాత్ర చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఉత్సాహభరిత వాతావరణంలో సాగిన ఊరేగింపు

శుక్రవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ప్రారంభమైన ఈ మహా శోభాయాత్రలో ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. యాత్ర ఆరంభంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ గణనాథుడి ఎదుట ఉత్సాహంగా నృత్యం చేస్తూ అందరిలోనూ జోష్ నింపారు. 'గణపతి బప్పా మోరియా' అనే భక్తుల నినాదాలతో హైదరాబాద్ నగర వీధులు మార్మోగాయి. ఈ యాత్ర సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ భవన్, ఇక్బాల్ మినార్, తెలంగాణ తల్లి చౌరస్తా మార్గాల గుండా ఎన్టీఆర్ మార్గ్‌కు చేరుకుంది.

హుస్సేన్‌సాగర్‌లో అశ్రునయనాల వీడ్కోలు

ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 4 వద్దకు గణపతి విగ్రహం చేరుకున్న వెంటనే, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 2.15 గంటల వేళ భారీ క్రేన్ల సహాయంతో మహాగణపతిని హుస్సేన్‌సాగర్‌లో





నిమజ్జనం చేశారు. తమ ఇలవేల్పు అయిన గణనాథుడిని మళ్లీ వచ్చే ఏడాది రావాలని కోరుకుంటూ భక్తులు కంటతడి పెట్టుకుంటూ కన్నీటి వీడ్కోలు పలికారు.

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

ఈ భారీ నిమజ్జన కార్యక్రమం విజయవంతం కావడంలో పోలీసు శాఖ మరియు ప్రభుత్వ యంత్రాంగం కీలక పాత్ర పోషించాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పటిష్ఠమైన బందోబస్తును ఏర్పాటు చేయడంతో, ఉత్సవాలు ఎంతో ప్రశాంతంగా, సురక్షితంగా ముగిశాయని నిర్వాహకులు తెలిపారు.

## పోలీసులను తన నివాసానికి ఆహ్వానించి సత్కరించిన ఏపీ హోంమంత్రి అనిత

### అనకాపల్లి జిల్లా పోలీసులను సత్కరించిన హోంమంత్రి అనిత
### రాష్ట్రస్థాయి క్రీడల్లో 6 స్వర్ణాలు గెలిచిన మహిళా కానిస్టేబుల్‌కు అభినందన
### టెక్నాలజీతో దొంగలను పట్టుకుంటున్న కానిస్టేబుల్‌కు ప్రశంసలు
### అవయవదానం చేసిన డీఎస్పీని ప్రత్యేకంగా అభినందించిన మంత్రి
### తన నివాసానికి ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేసిన అనిత



అమరావతి, అమృత్ తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనిత, విధి నిర్వహణలోనూ, క్రీడల్లోనూ, సామాజిక సేవలోనూ విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు పోలీసు సిబ్బందిని ఘనంగా సత్కరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలోని తన నివాసానికి వారిని ప్రత్యేకంగా ఆహ్వానించి, అభినందనలు తెలిపి, వారితో కలిసి భోజనం చేశారు. పోలీసు సిబ్బంది ప్రతిభను, సేవా స్ఫూర్తిని ప్రోత్సహించడం తన బాధ్యత అని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. వివరాల్లోకి వెళితే, ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా పోటీల్లో అనకాపల్లి జిల్లాకు చెందిన మహిళా కానిస్టేబుల్ వి. విజయ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఏకంగా ఆరు స్వర్ణ పతకాలు సాధించి సత్తా చాటారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ఆమె సాధిస్తున్న విజయాలు స్ఫూర్తిదాయకమని మంత్రి అనిత ప్రశంసించారు. విజయను ప్రత్యేకంగా సత్కరించి, ఆమె ప్రతిభను కొనియాడారు. అలాగే, పాయకరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కీలక కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగిస్తున్న కానిస్టేబుల్ రాంబాబును కూడా మంత్రి అనిత అభినందించారు. ముఖ్యంగా బైక్ దొంగతనాల కేసుల్లో 'ఐటీ కోర్ అనాలిసిస్' ద్వారా నిందితుల కదలికలను గుర్తించి, వారిని పట్టుకోవడంలో రాంబాబు చూపిన నైపుణ్యం ప్రశంసనీయమని ఆమె అన్నారు. వీరితో పాటు, అవయవదానం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావును కూడా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఆయన మానవతా విలువలను చాటిచెప్పారని కొనియాడారు.

ప్రజా సేవలో ముందుండే పోలీసు సిబ్బందికి అండగా నిలవడం, వారిని ప్రోత్సహించడం ఎల్లప్పుడూ తన బాధ్యత అని హోంమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## స్టాలిన్ గారూ, ఈ కేసుపై నోరు విప్పండి: సీఎం విజయ్ ఆగ్రహం

### వీరమణి లైంగిక వేధింపుల కేసుపై నోరు విప్పాలన్న విజయ్
### డీఎంకే హయాంలోనే కేసును తొక్కిపెట్టారని తీవ్ర ఆరోపణలు

అమృత్ తెలంగాణ: తమిళనాడు రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ప్రముఖ గ్రానైట్ వ్యాపారి ఆర్. వీరమణిపై నమోదైన లైంగిక వేధింపుల కేసు విషయంలో ముఖ్యమంత్రి విజయ్, డీఎంకే అధినేత ఎం.కే. స్టాలిన్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "స్టాలిన్ గారూ, ఈ ఉదంతంపై మీ మౌనాన్ని వీడండి" అంటూ డిమాండ్ చేశారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న విజయ్, డీఎంకే ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. "2025 అక్టోబర్‌లో, డీఎంకే హయాంలోనే ఈ కేసుకు సంబంధించి ఫిర్యాదు అందినప్పటికీ, వారు నిందితులను రక్షించేందుకు వాస్తవాలను తారుమారు చేశారు. తగిన ఆధారాలు లేవనే సాకుతో కేసును మూసివేశారు" అని విజయ్ ఆరోపించారు. ఈ వ్యవహారంలో డీఎంకే, ఏఐఏడీఎంకే పరస్పరం సహకరించుకున్నాయని, అందుకే ఆ రెండు పార్టీలు నోరు మెదపడం లేదని విమర్శించారు. తన తల్లిని విమర్శించినా సహిస్తానని, కానీ తమిళనాడులోని మహిళా లోకాన్ని అవమానిస్తే ఊరుకోనని స్పష్టం చేశారు. డీఎంకే శ్రేణులు, వారి కుటుంబ సభ్యులు ఇటువంటి అనైతిక చర్యలను ప్రోత్సహిస్తున్నారని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణలతో జెమ్ గ్రానైట్స్ చైర్మన్ ఆర్. వీరమణితో పాటు, ఆయనకు సహకరించిన



శాంతి, మహేంద్ర సింహన్‌లను 2026 ఆగస్టులో పోలీసులు అరెస్టు చేశారు. 2025లో ఓ సామాజిక కార్యకర్త విడుదల చేసిన వీడియో ఫుటేజ్‌తో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

# ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా చేపట్టాలి

**ఖరీఫ్ పంటల కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ రెవెన్యూ రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు...............**



అధికారులకు సూచనలు ఇస్తున్న ఇంచార్జ్ అడిషనల్ కలెక్టర్ రాథోడ్ రమేష్ దృశ్యం



హాజరైన అన్ని శాఖల అధికారులు

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో కలిసి ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంబంధిత శాఖల అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేస్తూ, పంట కొనుగోలును పకడ్బందీగా చేపట్టాలన్నారు. గతంలో క్షేత్రస్థాయిలో ఎదురైన అనుభవాల దృష్ట్యా తగిన ప్రణాళికలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి సమస్యలు కలగకుండా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని వివరించారు. వ్యవసాయ అధికారులు మండలాల వారీగా వివరాలు సేకరించి, తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కు సంబంధించి సామాగ్రి అంతా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, వ్యవసాయ అధికారి సుజాత, తూనికలు కొలతల అధికారి శంకర్, డిసిఓ నర్సయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలి

**పదవ తరగతి బోర్డు పరీక్షలకు విద్యార్థులంతా ఇప్పటి నుంచే స్పష్టమైన ప్రణాళికలతో సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పేర్కొన్నారు**



కలెక్టర్కు స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు విద్యార్థులు



విద్యార్థులకు పాఠాలు చెప్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా

నిర్మల్ జిల్లా సోన్ సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ సోన్ మండలం లెఫ్ట్ పోచంపాడ్ గ్రామంలోని ప్రభుత్వ బాలికల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అధికారులతో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతిరోజు విద్యార్థులందరికీ మెనూ ప్రకారం అన్ని వేళల్లో నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు సౌకర్యవంతమైన వసతి కల్పిస్తూ, మెరుగైన విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులందరూ పూర్తి సంఖ్యలో ప్రతిరోజు పాఠశాలకు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న భోజనం, విద్య తదితర వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో నేరుగా మాట్లాడుతూ, వారికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా, అన్ని వసతులు కల్పిస్తున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా సబ్జెక్టుల్లో సిలబస్ ఎంతవరకు పూర్తయిందో అడిగారు. విద్యార్థులందరూ బోర్డు పరీక్షలకు ఇప్పటినుంచే సన్నద్ధం కావాలన్నారు. ప్రతి సబ్జెక్టుకు తగిన సమయం కేటాయించి, ప్రణాళిక ప్రకారం చదివి, బోర్డు పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని చెప్పారు. సబ్జెక్టుల్లో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.




విద్యార్థులకు పెన్నులను బహుమతి అందజేస్తున్న కలెక్టర్

ఉపాధ్యాయులందరూ ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి, మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. బోర్డుపై విద్యార్థులతో గణిత సమస్యలను సాధింపజేశారు. లెక్కలు చేసిన విద్యార్థులను అభినందించి, వారికి పెన్నులను బహుమతులుగా ఇచ్చి వారిలో ఉత్సాహం నింపారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ సంతోష్, ఇతర అధికారులు, తదితరులు ఉన్నారు.

# రీ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**న్యూ వెల్మల్లో 80 శాతం సర్వే పూర్తి. మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలి**

**భూముల రీ సర్వే ద్వారా ఏళ్ల తరబడి కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు**



న్యూ వెల్మల్ లో భూముల రి సర్వే పై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ భవేష్ మిశ్రా,



హాజరైన రైతులు

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ శుక్రవారం సోన్ మండలం న్యూ వెల్మల్ గ్రామంలో భూముల రీ సర్వే ప్రక్రియపై గ్రామస్తులు, రైతులతో గ్రామ పంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రీ సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే ప్రక్రియతో భూముల హద్దులు, హక్కులకు సంబంధించి నెలకొన్న సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. న్యూ వెల్మల్ గ్రామంలో ఇప్పటికే 80 శాతం రీ సర్వే పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో రైతులు తప్పనిసరిగా తమ భూముల వద్ద అందుబాటులో ఉండి అధికారులకు సహకరించాలని సూచించారు. రీ సర్వేకు రైతులు అందిస్తున్న సహకారాన్ని కలెక్టర్ అభినందించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రక్రియ సజావుగా జరిగేలా సంబంధిత అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, గ్రామంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలకు రీ సర్వే ద్వారా పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వే పూర్తయ్యే వరకు అధికారులకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ చర్యలు చేపట్టిన కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ఛార్జి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏడీ ల్యాండ్ సర్వే అండ్ రికార్డ్స్ విఠల్, తహసీల్దార్ సంతోష్, సర్పంచ్ సాగర్, సంబంధిత అధికారులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా గణేష్ నిమజ్జనోత్సవం

**పాల్గొన్న జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



గణేష్ వేడుకల్లో ఎస్పీ



భోజనాలు వడ్డిస్తున్న ఎస్పీ

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రతిష్ఠించిన శ్రీ గణేష్ విగ్రహానికి ఈరోజు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రత్యేక పూజల అనంతరం జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు.అనంతరం ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీస్ సిబ్బంది కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ తో పాటు, వికారాబాద్ అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా, భైంసా ఏ ఎస్ పి సాయి కిరణ్,, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, 14 మంది డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లాలో గణేష్ నిమర్జనం శోభాయాత్ర ను పూజలు చేసి ప్రారంభిస్తున్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి, జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల

# కుబీర్ గణేష్ నిమజ్జనంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జీ. విఠల్ రెడ్డి



నిమజ్జనం వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి




గణ నాథుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి

నిర్మల్ జిల్లా కుబీర్ సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ కుబీర్ మండల కేంద్రంలో గణేష్ ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన గణేష్ నిమజ్జన కార్యక్రమంలో ముధోల్ మాజీ ఎమ్మెల్యే జీ. విఠల్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో నిర్మల్ జిల్లా డీసీసీ కార్యదర్శి సూది రాజన్న గారు రూ.55 వేలతో లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో భక్తులు, యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా ఉండాలని, నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కోరారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన విద్యార్థికి కలెక్టర్ ఆర్థిక చేయూత

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ ఆర్థిక ఇబ్బందులు ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో జిల్లా యంత్రాంగం అండగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. సిరికొండ మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి సీడం అర్జున్ ఢిల్లీలోని శ్రీ వెంకటేశ్వర కళాశాలలో బీఎస్సీ (ఆనర్స్) ఫిజిక్స్లో సీటు సాధించిన సందర్భంగా కలెక్టర్ శుక్రవారం తన ఛాంబర్లో రూ.50 వేల ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థి జాతీయ స్థాయి విద్యాసంస్థలో సీటు సాధించడం అభినందనీయమన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకుండా జిల్లా యంత్రాంగం అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఆర్థిక సహాయం అందించిన కలెక్టర్కు విద్యార్థి అర్జున్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏవో వర్ణ తదితరులు పాల్గొన్నారు.



# రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధి పనులపై కలెక్టర్ రాజర్షిషా సమీక్ష



రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్ పంచాయతీరాజ్ ఈ ఈ శివరాం మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రిమ్స్ లో అత్యవసర మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. రిమ్స్ ఆసుపత్రిలో అత్యవసర మరమ్మతులు, పునర్నిర్మాణ పనులు, నూతన ప్రతిపాదనలు, మౌలిక వసతుల కల్పనపై ఆయన శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రిమ్స్ ఆసుపత్రిలో చేపట్టాల్సిన అత్యవసర రిపేర్లు, తలుపులు, కిటికీలు, టాయిలెట్లు, ఆక్సిజన్ పైప్లైన్లు, జనరేటర్లు, లిఫ్ట్, రోడ్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులన్నీ ఎలాంటి జాప్యం లేకుండా అత్యవసర ప్రాతిపదికన వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మంజూరైన రూ.11.10 కోట్ల అత్యవసర నిధులతో విద్యుద్ధీకరణ, రోడ్లు, భవన సముదాయాలు, మౌలిక వసతులు, శానిటేషన్ పనులకు సంబంధించిన మరమ్మతు నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని, చేపట్టిన ప్రతి పనులోనూ ఖచ్చితంగా వారంటీ, ఏఎంసీ ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. క్రిటికల్ కేర్ బ్లాక్ పనులను కేవలం 15 రోజుల్లో పూర్తి చేసేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని, టెండర్ల విషయంలో జాప్యం జరగకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని సూచించారు. అవుట్పేషెంట్, ప్రెగ్నెంట్ బ్లాక్ మధ్య రోగుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పనుల కేటాయింపులో ఎలాంటి సిఫార్సులు, పక్షపాత ధోరణులు ఉండకూడదని, ప్రతి పనిలోనూ పూర్తి పారదర్శకత పాటించాలని అధికారులను హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీపీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, పంచాయతీ రాజ్ ఈఈ శివరామ్, తదితర ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సన్నాలకు రికార్డు ధర

హైదరాబాద్,అమృత్ తెలంగాణ: ఖరీఫ్ సీజన్ వరి పంట చేతికొస్తున్న క్రమంలో సన్న ధాన్యానికి డిమాండ్ గణనీయంగా పెరుగుతోంది. తేమ శాతం ఎక్కువగా ఉన్న పచ్చి ధాన్యానికి క్వింటాల్కు రూ.2,950 వరకు రికార్డు ధర పలుకుతోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం భవానీపేట్, వర్ని మండలం నెహ్రూనగర్ గ్రామాల్లో వరి కోతలు ఇప్పటికే ప్రారంభం కాగా.. బీపీటీ ధాన్యానికి అత్యధిక ధర పలకడం విశేషం. నిజామాబాద్ జిల్లా నుంచి నల్లగొండ, వరంగల్, హైదరాబాద్, మహబూబ్నగర్తో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు కూడా ధాన్యం తరలుతోంది. దీంతో రైతులకు అధిక ధర గిట్టుబాటవుతోంది. ఇటు రాష్ట్రంలో బియ్యం ధరలు కూడా పెరిగాయి. గత 3 నెలల కాలంలో కిలోకు క్రమంగా రూ.10–13 వరకు పెరిగాయి. సన్న బియ్యంలో టాప్ క్వాలిటీ బియ్యం ప్రస్తుతం కేజీ రూ.73–75 వరకు చేరింది. ఇక ధాన్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర సాధారణ రకాలైతే క్వింటాల్కు రూ.2,441 ఉంది. ఏ–గ్రేడ్ ధాన్యమైతే క్వింటాల్కు రూ.2,461 ఉంది. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ లెక్క ప్రకారం చూస్తే ధర క్వింటాల్కు రూ.2,941 అవుతుంది. అయితే తేమ శాతం 17 మాత్రమే ఉండాలనేది ప్రభుత్వ నిబంధన. అంతకంటే ఎక్కువ తేమ ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తీసుకోరు. ఎమ్మెస్పీ కూడా తరుగు లెక్కన తగ్గిపోతుంది.పచ్చి ధాన్యం ప్రైవేటు మార్కెట్ రేటు మాత్రం ఇందుకు భిన్నంగా ఉంటుంది.

# రూ. 5 కోట్ల ప్రజాధనం వృథా......

## మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై భగ్గుమన్న దళిత సంఘాలు.........

## భవనాన్ని వెంటనే ఎస్సీ సంక్షేమ శాఖకు అప్పగించకపోతే మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరిక..............



దళిత సంఘ నాయకులతో దురుసుగా మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్




మున్సిపల్ కమిషనర్ దురుసు ప్రవర్తనకు నిరసనగా అంబేద్కర్ సంఘం నాయకుల నిరసన

నిర్మల్:జిల్లా సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ సుమారు రూ. 5 కోట్ల ప్రజాధనంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన అంబేద్కర్ భవనాన్ని నిరుపయోగంగా మార్చి, కనీస నిర్వహణ లేకుండా వదిలేసిన నిర్మల్ మున్సిపల్ అధికారుల తీరుపై తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం, దళిత సంఘాల నాయకులు శుక్రవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు

డస్ట్‌బిన్‌గా మారిన రూ. 5 కోట్ల భవనం

ప్రజాధనాన్ని సద్వినియోగం చేయాల్సిన మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని నాయకులు మండిపడ్డారు. భవన ప్రాంగణాన్ని పశువులను కట్టేసే దొడ్డిగా మార్చారని, పార్కింగ్ ప్రదేశాల్లో చెత్త బండ్లు నిలిపివేసి డంపింగ్ యార్డులా తయారు చేశారని ధ్వజమెత్తారు. అంతేకాకుండా, కోతులను పట్టే సిబ్బందికి నివాసంగా, జిల్లాలోని చెత్తనంతటినీ డంప్ చేసే గోదాంలా మార్చడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

రెండు రోజుల డెడ్‌లైన్ .. లేదంటే ముట్టడే !

రాబోయే రెండు రోజుల్లో సదరు భవనాన్ని పూర్తిగా శుభ్రపరిచి, అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించాలని నాయకులు స్పష్టం చేశారు. వెంటనే ఆ భవనాన్ని జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి (ఎస్సీ డీడీ)కి అప్పగించాలన్నారు. లేనిపక్షంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని దళిత సంఘాలు, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో 'ఛలో కమిషనర్ కార్యాలయం' పేరుతో మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు, వివిధ దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మా భవనాన్ని మాకు అప్పజెప్పండి

## అంబేద్కర్ భవనాన్ని ఎస్సీడీడీకి అప్పగించాలని, ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు నివేదికలు పంపాలని కలెక్టర్ కు వినతి...

నిర్మల్ జిల్లా సెప్టెంబర్ 25 అమృత్ తెలంగాణ నిర్మల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనాన్ని ఎస్సీ అభివృద్ధి అధికారికి అప్పగించి, పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు సూచనల మేరకు సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ హదీ ,పూదరి అరవింద్ , అంబేద్కర్ సంఘ జిల్లా అధ్యక్షులు బత్తుల రంజిత్ , జిల్లా నాయకుల కొంతం మురళీధర్ , బుద్ధ విహార్ కమిటీ ప్రధాన కార్యధర్శి మదుకర్,మాజీ సర్పంచులు మదు , రవిందర్ ,రమేష్ తదితరులు గురువారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందజేశారు. సుమారు రూ. 5 కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవనం పూర్తిస్థాయిలో వినియోగంలోకి రాకపోవడంతో జిల్లాలోని దళిత వర్గాల ప్రజలు భవన సేవలను పూర్తిగా పొందలేకపోతున్నారని పేర్కొన్నారు.



మా భవనాన్ని మాకు అప్పగించండి అటు కలెక్టర్కు వినతి పత్రం అందజేసిన కాంగ్రెస్ దళిత సంఘ నాయకులు

భవనంలో ప్రతిధ్వని నివారణ చర్యలు చేపట్టడంతో పాటు కుర్చీలు, ఏసీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి, రంగులు వేయించి తిరిగి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అంబేద్కర్ భవనంలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతకుశిక్షణ ఇచ్చే విధంగా ఏర్పాట్లకు నివేదికలు పంపాలని . సాంఘీక సంక్షేమల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ గారు నిదులు విడుధలకు సిద్దంగా ఉన్నారని వెంటనే అవసరమైన నివేదికలు పంపాలని తెలుపగా . కలెక్టర్ మాట్లాడుతూ మంత్రిగారు ఫోన్లో ఆధేశించారు దానిప్రకారమే ఈ రోజు నివేదికలు పంపడం జరిగింది . మీరు కోరుకున్నట్టే భవనాన్ని కూడా ఎస్సీ డిడి కే నిర్వహణ బాధ్యాతలు అప్పగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు

# 20వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ.

## ప్రారంబించిన కౌన్సిలర్ మాసుల ప్రవీణ్.

మెట్‌పల్లి: అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 25: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మెట్‌పల్లి పట్టణంలోని 20వ వార్డులో ఘనంగా ప్రారంభమైంది. 20వ వార్డు కౌన్సిలర్ మాసుల ప్రవీణ్ స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాసుల ప్రవీణ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత పారదర్శకంగా, సులభంగా అందించాలనే ఉద్దేశంతో స్మార్ట్ కార్డులను అందిస్తున్నట్లు తెలిపారు.కార్డుల పంపిణీ సందర్భంగా వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు





కామారెడ్డి జిల్లా ప్రతినిధి/అమృత్ తెలంగాణ గాంధారి మండలంలో శుక్రవారం ఆయిల్‌పామ్ గెలల కోత కార్యక్రమం నిర్వహించారు. మండలానికి చెందిన రైతు శానం భాస్కర్ నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేస్తున్నారు. ఆయన ఆయిల్‌పామ్ తోటలో గెలల కోత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శానం భాస్కర్ మాట్లాడుతు ఇప్పటివరకు తన నాలుగు ఎకరాల ఆయిల్‌పామ్ తోట నుంచి సుమారు 14 టన్నుల దిగుబడి పొందినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలను పొందుతున్నానని, ఇతర పంటలతో పోలిస్తే తక్కువ శ్రమతో, తక్కువ నీటి వినియోగంతో ఈ పంటను సాగు చేయవచ్చని తెలిపారు. అలాగే, ఆయిల్‌పామ్ గెలలను సంబంధిత కంపెనీ కొనుగోలు చేస్తుండటంతో మార్కెటింగ్ విషయంలో రైతులకు భరోసా ఉంటుందని, అందువల్ల మరింత మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి జ్యోతి, మండల ఉద్యాన శాఖ అధికారి సుమన్, హిందుస్థాన్ యూనిలీవర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ చంద్రబాబు, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ మేనేజర్ సాయికుమార్, ఫీల్డ్ ఆఫీసర్లు రవీందర్, ప్రదీప్తో తో పాటు ఆయిల్‌పామ్ రైతులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి ప్రెస్ క్లబ్‌లో ఘనంగా చీటి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు

మెట్ పల్లి: అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 25:తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ( టీ.యూ.డబ్ల్యూ.జే – ఐ.జే.యు) జగిత్యాల జిల్లా అధ్యక్షులు, మన తెలంగాణ దినపత్రిక జగిత్యాల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చీటి శ్రీనివాస్ రావు జన్మదిన వేడుకలు మెట్ పల్లి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శుక్రవారము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెట్ పల్లి ప్రెస్ క్లబ్ సభ్యులు విచ్చేసిన తోటి పాత్రికేయులు, మిత్రులు, శ్రేయోభిలాషులు శ్రీనివాస్ రావును ఘనంగా సత్కరించి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి తమ ఆనందాన్ని పంచుకున్నారు. పాత్రికేయ వృత్తిలో నిత్యం ప్రజా సమస్యలపై గళం ఎత్తుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ కోసం అంకితభావంతో పనిచేస్తున్న శ్రీనివాస్ రావు మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలోఅధ్యక్షులు డాక్టర్ బూరం సంజీవ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్ , జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బొసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ , క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పింజరి



శివ కుమార్, పుంద్ర శశికాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్ ,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్ , హైమద్, ముత్యాల రమేష్ ,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్, సమీర్ అలీ , తెలుకంటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

# గణేష్ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ న్యూస్ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గణేష్ నిమజ్జన ఉత్సవాలు ఘనంగా సాగాయి. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లను చేయగా నిమజ్జన శోభయాత్రలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ , హిందూ ఉత్సవ సమితీ అధ్యక్షులు బెండ లచ్చన్న తో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పాల్గొనడం జరిగింది. ముందుగా సరస్వతి శిశు మందిర్‌లో ప్రతిష్టించిన గణపతికి ఉత్తర పూజ నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని అతిధులు ప్రారంభించారు. కార్యక్రమంలో వక్త ప్రకాష్ డి.ఎస్.పి జీవన్ రెడ్డి,బజరంగ్ లాల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన వినాయక శోభయాత్ర కన్నుల పండువగా సాగింది.



వినాయకుని ఎత్తుకున్న ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి దృశ్యం

# అమృత్ 2.0 పనులను వేగవంతం చేయాలి

## జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





అమృత్ తెలంగాణ మంచిర్యాల జిల్లా న్యూస్ ప్రజలకు నిరంతరం శుద్ధమైన త్రాగునీటిని అందించే లక్ష్యంతో చేపట్టిన అమృత్ 2.0 పథకం పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న అమృత్ 2.0 పథకంలో భాగంగా నస్పూర్‌లోని ఆర్‌కే-6 వద్ద నిర్మిస్తున్న 1 వేయి కిలోలీటర్ల సామర్థ్యం గల ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్, హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్మిస్తున్న 1 వేయి 500 కిలోలీటర్ల సామర్థ్యం గల ఈ.ఎల్.ఎస్.ఆర్. నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. పనులలో జాప్యం లేకుండా అదనపు కార్మికులను సమీకరించి, శ్రామిక బలాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అమృత్ 2.0 పథకం క్రింద చేపట్టిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన త్రాగునీటి సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అనంతరం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భావన సముదాయంలో గల జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో అధికారులు, ఎల్.పి.జి. డీలర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు ఎల్.పి.జి. గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన కార్యాచరణ ప్రకారం వినియోగదారుల ఈ-కెవైసి ప్రక్రియను పూర్తి చేయాలని, నిర్ణీత గడువులోగా ప్రక్రియ పూర్తి చేసేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌పీజీ వినియోగదారులకు ఊరట

వాంకిడి(ఆదిలాబాద్): అమృత్ తెలంగాణ:పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం కారణంగా ఈ ఏడాది మార్చి నుంచి గ్యాస్ సిలిండర్ల రీఫిల్ బుకింగ్‌లపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. దీంతో పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు గ్యాస్‌ను పొదుపుగా వినియోగించారు. ఒక సిలిండర్ బుక్ చేసిన తరువాత మళ్లీ తీసుకోవాలంటే పట్టణ ప్రాంతాల్లో 35, గ్రామీణ ప్రాంతాల వారు 45 రోజులు ఆగేవారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరా మెరుగుపడడంతో ఆంక్షలను సడలించారు.

25 రోజులకే సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 25 రోజులకు సిలిండర్ బుక్ చేసుకునే అవకాశం కల్పించడంతో గ్యాస్ గోదాముల వద్ద రద్దీ బాగా తగ్గింది. 45 రోజులకు బుకింగ్ చేసుకోవాలని ఆంక్షలు ఉన్నప్పుడు సిలిండర్ రీఫిల్ కోసం గోదాముల వద్ద వినియోగదారులు బారులు తీరేవారు. ప్రస్తుతం మళ్లీ పూర్వపు పరిస్థితులు నెలకొనడంతో వినియోగదారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

కొత్త కనెక్షన్ల కోసం..



కొత్త గ్యాస్ కనెక్షన్ల మంజూరు నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కొత్త గ్యాస్ కనెక్షన్ల జారీపై కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా నిషేధం అమలు చేస్తోంది. గత మార్చి నుంచి ఏజెన్సీలు, కొత్త కనెక్షన్లు ఇవ్వడం లేదు. దీంతో గ్యాస్ కనెక్షన్ ఇప్పటి వరకు లేని వారు, కొత్తగా పెళ్లయిన జంటలు, వేరు కాపురాలు పెట్టిన వారు, జీవనో పాధి కోసం ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కొత్త గ్యాస్ కనెక్షన్ల కోసం ఎదురు చూస్తున్నారు. ఇంధన దిగుమతి సరిగా లేకపోవడంతో కొత్త గ్యాస్ కనెక్షన్ల మంజూరును కేంద్ర ప్రభుత్వం నిలిపివేసింది.

ప్రస్తుత పరిస్థితుల్లో కొత్త కనెక్షన్లు మంజూరు చేస్తే సంక్షోభం మరింత పెరుగుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని 12 గ్యాస్ ఏజెన్సీల్లో 1,41,212 గృహ అవసర కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెల 52 వేల సిలిండర్లు సరఫరా చేస్తున్నారు. కాగజ్‌నగర్‌లోని ఏజెన్సీల్లో 17 వేలు, ఆసిఫాబాద్‌లో 8 వేలు, కౌటాలలో 6 వేలు సరఫరా అవతున్నాయి. కొత్త కనెక్షన్లు జారీ చేస్తే ఎంతో మందికి ప్రయోజనం కలుగుతుంది.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ

వినాయక నవరాత్రి ముగింపు ఉత్సవాలు రాజకీయాలకు అతీతంగా శాంతి యుతంగా జరుపుకోవాలి..

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

ఎన్నికల వరకు రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్






జగిత్యాల: అమృత్ తెలంగాణ సెప్టెంబర్ 25: జగిత్యాల జిల్లా కేంద్రంలో రాణఖీ నిధులు రూ. 10 లక్షలతో నూతనంగా నిర్మించిన నాయి బ్రాహ్మణ సంఘం అదనపు కార్యాలయాన్ని జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి శ్రీనివాస్ తో కలిసి జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలోని అన్ని కుల సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జగిత్యాల పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. యూఐడీఎఫ్ నిధులు రూ. 62.5 కోట్లతో జగిత్యాల పట్టణంలోని అన్ని వార్డులకు రూ. కోటికి తక్కువ కాకుండా నిధులు కేటాయించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలుతీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు ఉండాలని, అభివృద్ధి మాత్రం నిరంతర ప్రక్రియగా కొనసాగాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కొందరు కావాలనే జగిత్యాల అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నారని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ప్రజలు వినాయక నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు, కార్యక్రమాలు నిర్వహించి మన సంస్కృతి, సంప్రదాయాలను ఆదర్శంగా నిలపాలని ఎమ్మెల్యే సూచించారు. మన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు కార్యక్రమాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించిన పాటలు వేయడం, ఇష్టారీతిన వ్యవహరించడం తగదని, ఇలాంటి చర్యలను పూర్తిగా ఖండిస్తున్నానని తెలిపారు. ప్రజలు శాంతిభద్రతలకు భంగం కలగకుండా వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించాలని కోరారు. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. 119 కోట్ల తో జగిత్యాల మెడికల్ కళాశాల పనులు వేగంగా పూర్తవుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో 14కోట్లు మంజూరు కాగా ఈ ప్రభుత్వం పూర్తి నిధులు కేటాయించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో రూ. 9 కోట్లు చెల్లించగా, రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మరో రూ. 9 కోట్ల నిధుల మంజూరు తో మిగిలిన రోడ్లు, డ్రైనేజీ పనుల పూర్తికి అవసరమవుతాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. మోరపల్లి, తాటిపల్లి, చలిగల్ శివారుల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా 2,500 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రూ. 235 కోట్లతో 400కు పైగా పడకల సామర్థ్యంతో జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆసుపత్రి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం ఉంటుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని కుల సంఘాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. నాయి బ్రాహ్మణుల సెలూన్ లకు ఉచిత విద్యుత్‌తో పాటు

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ప్రజల సహకారంతో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీ సి సి అధ్యక్షులు గజంగి నందయ్య ,కౌన్సిలర్ వేముల శ్రీనివాస్,సంఘం అధ్యక్షులు పెండెం మహేందర్ , టీ పీ సి సి సెక్రటరీ బండ శంకర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం కో ఆప్షన్ సభ్యులు గట్టు సతీష్ పట్టణ అధ్యక్షులు కొత్త మోహన్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు దుమల రాజ్ కుమార్ కౌన్సిలర్ మ్యానపురి మహేష్, రాచర్ల విజయ్ మాజీ కౌన్సిలర్ ముస్కు నారాయణ రెడ్డి వీరబత్తినీ శ్రీనివాస్ మానాల కిషన్ ఎనగందుల శ్రవణ్ రాకేష్ తొలిప్రేమ శ్రీనివాస్ శరత్ రావు పవన్ వేణు పాలోజి సత్యం మహేష్ సంఘం సభ్యులు గంగిపెల్లి గంగవ్వ రాజేశం శంకర్ గంగరాజం రాచమల్ల శ్రీనివాస్ మగ్రిపెల్లి సాగర్ రాచర్ల శ్రీనివాస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు .

# పన్నుల సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్!



గద్వాల క్రైం, అమృత్ తెలంగాణ: ప్రజల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసిన సొమ్మును మున్సిపల్ కార్యాలయంలోని ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి పక్కదారి పట్టించాడు. పన్నుల సొమ్ముతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లుఆడి సుమారురూ. 34 లక్షల దాకా పోగొట్టుకున్నాడు. ఉన్నతాధికారులు ఆ డబ్బు అడుగుతారనే భయంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గద్వాల మునిసిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో పని చేస్తున్న ఓ కాంట్రాక్టు ఉద్యోగి ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. మునిసిపల్ కార్యాలయానికి సంబంధించి పన్నుల రూపంలోవసూలు చేసిన డబ్బులో నుంచి రూ. 34 లక్షలను ఆ ఉద్యోగి బెట్టింగ్‌లకు ఉపయోగించినట్లు తెలిసింది. ఆ డబ్బు పోవడం, తిరిగి ఎలా చెల్లించాలో తెలియక ఆ కాంట్రాక్టు ఉద్యోగి గురువారం తెల్లవారుజామున పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా, సదరు ఉద్యోగి తన దగ్గర ఉన్న డబ్బులతో పాటు ఇతర వ్యక్తుల వద్ద అప్పులు చేసి మరీ బెట్టింగ్‌లకు పాల్పడేవాడని, అప్పులపాలైతే గతంలో కుటుంబసభ్యులు వాటిని తీర్చారని సమాచారం. అలాగే, మున్సిపల్ పరిధిలో వసూలు చేసిన పన్నులను కూడా గతంలోనూ బెట్టింగ్‌లకు ఉపయోగించినట్లు చెబుతున్నారు. ఆ డబ్బును కుటుంబసభ్యులే తిరిగి మున్సిపాలిటీకి జమ చేసినట్లు తెలుస్తోంది. గతంలో కూడా ఓ సారి ఆత్మహత్యకు యత్నించినట్లు చెబుతున్నారు. కాగా,సదరు ఉద్యోగి దాదాపు రూ. 10 లక్షలకు పైగానే వాడుకున్నట్లు తెలుస్తుందన్నారు. ఇందుకుసంబంధించి ముగ్గురు సిబ్బందికి మెమోలు ఇచ్చామని, సదరు ఉద్యోగిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

## జగిత్యాలలో విషాదం.. డ్యాన్స్ చేస్తూ యువకుడి మృతి

జగిత్యాల, సెప్టెంబర్ 25: అమృత్ తెలంగాణ: జిల్లాలోని తులసినగర్‌లో విషాదం చోటు చేసుకుంది. డ్యాన్స్ చేస్తూ ఓ యువకుడి మృతిచెందడం తీవ్ర కలకలం రేపింది. గుండెపోటుతో జయంత్ అనే యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. మిత్రులతో కలిసి డ్యాన్స్ చేస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. తులసినగర్‌కు చెందిన 24 ఏళ్ల తోపారపు జయంత్ ప్యాడ్ బ్యాండ్ సౌండ్స్‌కు ఎంతో ఉత్సాహంగా డ్యాన్స్ చేస్తున్నాడు. మిత్రులతో కలిసి డ్యాన్స్ చేస్తుండగా.. కొద్దిసేపటికే యువకుడు కుప్పకూలాడు. అక్కడే ఉన్న పోలీసులు సిబ్బంది వెంటనే స్పందించారు. ఘటనాస్థలంలోనే యువకుడికి సీపీఆర్ చేశారు. యువకుడు పడిపోయిన వెంటనే 108కు స్థానికులు సమాచారం అందించేందుకు ప్రయత్నించారు. అంతకంతకూ యువకుడి పరిస్థితి విషమించడాన్ని పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో అంబులెన్స్ స్పందించకపోయినప్పటికీ పోలీస్ వాహనంలోనే జయంత్‌ను ఆస్పత్రికి తరలించారు. యువకుడిని పరీక్షించి వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అప్పటి వరకు తమతో కలిసి డ్యాన్స్ చేసిన మిత్రుడు విగతజీవిగా మారడంతో తోటి స్నేహితులు విషాదంలో మునిగిపోయారు.

# హోటల్ గదిలో 'చిరుత' భామ..



నేహా శర్మ ఆమె సిస్టర్ ఐషా శర్మ నెట్టింట చేసే హంగామా అంతా ఇంతా కాదు. ఓ రేంజ్లో హాట్ ఫొటోలతో సోషల్ మీడియాని హీటెక్కించేస్తుంటారు. వీరి ఫొటో షూట్ల ధాటికి నెటిజన్స్ కి పిచ్చెక్కిపోతుంటుంది. అవకాశాలు తక్కువ .. ఆర్భాటాలు ఎక్కువ అన్నట్టుగా వీరి వ్యవహారాం గత కొన్ని నెలలుగా సాగుతోంది. ఎప్రీడే ఒక్క హాట్ ఫొటోని లేదా హాట్ హాట్ వీడియోని సోషల్ మీడియాలోకి వదలనిదే వీరికి నిద్ర పట్టదా అనేంతగా వీరి సోషల్ మీడియా పోస్టు వార్తల్లో నిలుస్తుంటాయి. అక్క నేహాశర్మని మించిన హాట్ నెస్ చెల్లి ఐషా శర్మ సొంతం. ఇద్దరూ కలిసి ఇన్ స్టాని ... ట్విట్టర్ ని హీటెక్కిస్తున్నారు. తాజాగా నేహా శర్మ తన ఇన్ స్టా పేజీలో ఓ హాట్ వీడియోని పోస్ట్ చేసింది. నేహాశర్మ ఓ హోటల్ గదిలోని బెడ్పై పడుకుని వుంటే గింబల్ సహాయంతో పై భాగం నుంచి నేహా అందాలని కెమెరామెన్ క్యాప్చర్ చేస్తున్నాడు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీనిపై నెటిజన్స్ ఎవరికి తోచిన కౌంటర్లు వారు వేసేస్తున్నారు. కెమెరా మెన్ అందాల్ని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేస్తున్నాడని ఓ నెటిజన్ కామెంట్ చేస్తే .. ఆ కెమెరామెన్ ని నేనే అయితే బాగుండేది కదా అని మరో నెటిజన్ ఫీలయ్యాడు. 'ఇల్లీగల్ 2' కోసమా ఇదంతా అంటూ మరో నెటిజన్ కామెంట్ చేశాడు. నేహాశర్మ మెగాపవర్ స్టార్ రామ్చరణ్ హీరోగా ఎంట్రీ ఇచ్చిన 'చిరుత' సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు పరిచయమైంది.

# నాభిలో ముత్యం.. మెడలో హారంతో కిల్లర్ బ్రైడ్

నాభిలో ముత్యం.. మెడలో హారం.. గుండెల్ని కోసేసే క్రీగంటి చూపులతో కిల్లర్ బ్రైడ్ ఎవరై ఉంటారు? ప్రత్యేకించి చెప్పాలా? అతిలోక సుందరి ముద్దుల తనయ జాన్వీకపూర్ అది. తన పబ్లిక్ అప్పియరెన్స్ వరుస ఫోటోషూట్ల గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇన్ స్టా వేదికగా టెంప్టింగ్ ఫోటోలు వీడియోలతో ఎప్పటికప్పుడు హీటెక్కిస్తూనే ఉంటుంది. జిమ్..యోగా సెషన్లతో పాటు స్కిన్ టైట్ వస్త్రధారణతో జాన్వీ సమ్ థింగ్ స్పెషల్ అని ప్రూవ్ చేసింది. తాజాగా బ్రైడల్ ఏషియా మ్యాగజైన్ కవర్ పేజీ కోసం జాన్వీ మరోసారి మనోహరిలా మారిపోయింది. ఔరా అనిపించే లెంహంగా లుక్ లో కట్టిపడేస్తోంది. మిరిమిట్లు గొలిపే డిజైనర్ దుస్తుల్లో హీట్ పెంచుతోంది. రకరకాల దుస్తుల్లో జాన్వీ కనిపించింఇ. ఇందులో నీలిరంగు ఎంబ్రాయిడరీ దుస్తుల్లోనూ మరో ఫోజు ఆకట్టుకుంది. అద్భుతమైన స్వీక్వెన్డ్ బ్లూ గౌనులో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. మెడలో రూపాయి బిళ్లలంతా డిజైన్డ్ నెక్లెస్ ని ధరించింది. వెనుక సెట్ డిజైన్ షేడ్ ఎలివేషన్ లో జాన్వీ మరింత హైలైట్ గా కనిపిస్తోంది ఇంత అందమైన ప్రొఫెషనల్ డిజైనర్ లుక్ వెనుక ఎవరు ఉన్నారంటే? స్టార్ డిజైనర్ రాహుల్ మిశ్రా. ఆయనే ఈ డ్రెస్ ని ఇంత అందంగా డిజైన్ చేసారు. ప్రస్తుతం ఈ కవర్ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. గతంలో జాన్వీ చాలా కవర్ పేజీల కోసం ఫోజులిచ్చింది. కానీ లెహంగా లుక్ లో ఫోజులివ్వడం ఇదే తొలిసారి. దీంతో నెటి జనులు ఆసక్తికర కామెంట్లు గుప్పిస్తున్నారు. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం కరణ్ జోహార్ బ్యానర్లో 'దోస్తానా–2'లో నటిస్తోంది. అదే బ్యానర్ లో మరో రెండు చిత్రాలు కమిట్ అయింది. అలాగే అమ్మడు నటించిన 'గుడ్ లక్ జెర్రీ' సినిమా షూటింగ్ పూర్తిచేసుకుని రిలీజ్ కి రెడీగా ఉంది. 'మిలీ' అనే మరో చిత్రంలో కూడా నటిస్తుంది. వచ్చే ఏడాది ఆ సినిమా రిలీజ్ కానుంది. ఇక దక్షిణాదిన ఎంట్రీ ఇవ్వడానికి జాన్వీ ఆసక్తిగానే ఉంది. కానీ సరైన ప్రాజెక్ట్ కోసం ఎదురు చూస్తుంది. ఆ ఛాన్స్ వస్తే వదులుకోవడానికి ఎంత మాత్రం సిద్ధంగా లేదు. తల్లి తరహాలోనే అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలని ప్రణాళికతో ముందుకు వెళ్తోంది.

బోనీ–కరణ్ గుడ్ ప్లానింగ్..




కెరీర్ పరంగా ఎదురేలేని పొజిషన్ లో ఉన్న జాన్వీ కపూర్ తన స్టార్ డమ్ ని మరో లెవల్ కి తీసుకెళ్లే ప్లాన్ లో ఉంది. ప్రస్తుతం నటవారసురాలిపై సౌత్ ఇండస్ట్రీ కళ్లు కూడా ఉన్నాయి. ఇటీవల టాలీవుడ్ కోలీవుడ్ సహా సౌతిండస్ట్రీస్ లో జాన్వీ కపూర్ పేరు మార్మోగిపోతోంది అంటే అందుకు తన స్పీడ్ ప్రధాన కారణం. పాపా బోనీ కపూర్ ఇప్పటికే తెలుగులో ప్రముఖ బ్యానర్లతో టచ్ లో ఉన్నారు. తన కుమార్తెలు జాన్వీ కపూర్ .ఖుషీ కపూర్ లకు ఇక్కడ లైన్ క్లియర్ చేస్తున్నారు. పనిలో పనిగా జాన్వీ– ఖుషీ సిస్టర్స్ కెరీర్ ని పీక్స్ కి తీసుకెళ్లేందుకు ధర్మ ప్రొడక్షన్స్ అధినేత డీసీఏ కర్త కరణ్ జోహార్ తనవంతు సలహాలు సూచనలు ఇస్తున్నారు. ఇటీవల వేడెక్కించే ఫోటోషూట్ల వెనక కరణ్ ప్రోద్బలం ఎంతైనా ఉందనిఅంతా భావిస్తున్నారు. మొత్తానికి డాడీ బోనీ..గురువు కరణ్ క్యూట్ కిడ్స్ ని స్టార్లు గా మలిచేందుకు అవసరమైన అన్ని ఎత్తుగడలతో వేడెక్కిస్తున్నారని కథనాలొస్తున్నాయి. ప్రస్తుతం జాన్వీ కిల్లర్ లుక్ అంతర్జాలాన్ని షేక్ చేస్తూ ఏకే 47 నుంచి దూసుకొచ్చిన బుల్లెట్ లా దూసుకెళుతోంది.

## సొగసరితో నటసింహం.. ట్రీట్ కి రెడీనా?

నటసింహా నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'అఖండ'. బోయపాటి దర్శకుడు. ప్రగ్య జైశ్వాల్ కథానాయిక. ఎట్టకేలకు చిత్రబృందం 'అఖండ' ప్రచారాన్ని ప్రారంభించింది. సినిమాలోని మొదటి సింగిల్ 'అడిగా అడిగా..' మెలోడీని 18 సెప్టెంబర్ (రేపు) సాయంత్రం 5.33 గంటలకు విడుదల చేయనుంది. ఆ మేరకు పోస్టర్ ద్వారా విషయాన్ని టీమ్ వెల్లడించింది. ఇందులో బాలకృష్ణ – ప్రగ్యా జైస్వాల్ ప్లెజెంట్ వాకింగ్ సెషన్ మరిపిస్తోంది. ఆయనకు సరిజోడు ప్రగ్య అన్నంతగా ఒదిగిపోయి కనిపిస్తోంది ముంబై సోయగం బాలకృష్ణ ఫార్మల్స్ లుక్ లో అదుర్స్. సింపుల్ స్టైల్ తో ప్లెజెంట్ గా కనిపిస్తున్నారు. ఒక కోణంలో ఆయన సింగాన్ని తలపిస్తున్నారు. ప్రగ్యా ఆయనకు సరిజోడు అన్నంతగా చీరలో ఎంతో సొగసుగా కనిపిస్తున్నారు. సింహా– లెజెండ్ తర్వాత బాలయ్యను మరో లెవల్లో ఆవిష్కరిస్తున్నారు బోయపాటి. అతడిలోని ఉగ్రుడినే కాదు.. రొమాంటిక్ మ్యాన్ ని కూడా తెరపై చూపించనున్నారు. ఇప్పటివరకు విడుదలైన రెండు టీజర్ లకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన తర్వాత అఖండ పై భారీ హైప్ పెరిగింది. ఈ సినిమాకి థమన్ సంగీతం ప్రధాన అస్సెట్ కానుంది. బాలయ్యకు మరో మ్యూజికల్ హిట్ ఖాయమని అర్థమవుతోంది. ఇప్పటికే బాలయ్య – బోయపాటి హ్యాట్రిక్ హిట్ పై కన్నేశారు.

# అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

## మనోహరి.. పైన పటారం లోన లొటారం!



బాలీవుడ్ హాట్ ఆటం బాంబ్ నోరా ఫతేహీ ట్యాలెంట్ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఓవైపు సినిమాలు.. మరోవైపు వెబ్ సిరీస్ లో.. ఇంకొక వైపు పాప్ ఆల్బమ్స్ లోనూ నటిస్తూ బిజీగా ఉంది. వచ్చిన ఏ అవకాశాన్ని వదిలిపెట్టకుండా సద్వినియోగం చేసుకుంటోంది. బాహుబలి మనోహరిగా తన పాపులారిటీ ఒక రేంజులోనే ఉంది. బాలీవుడ్ తో పాటు అడపాదడపా ఇతర భాషల్లో నటిగాను అవకాశాలు అందుకుంటూ ఆ రకంగా అమ్మడు దూసుకుపోతోంది. అయితే బాలీవుడ్ లో మాత్రం నటనకు ఆస్కారం వున్న పాత్రల్లో కనిపించింది చాలా తక్కువే. స్పెషల్ అప్పిరియన్స్ తోనూ ఎక్కువ ఐడెంటీటిని సంపాదించింది. ముఖ్యంగా నోరా ఐటమ్ క్వీన్ గానే ఎక్కువ పాపులరైంది. బుల్లితెర రియాలిటీ షోల జడ్జిగానూ బిజీగా ఉంది. ఇలా రకరకాల కోణాల్లో కెరీర్ బిల్డ్ చేసుకుని ముందుకెళ్తోంది. ఇక ఆఫ్ ది స్కీన్ లో నోరా ఫోటోషూట్స్ ఎలివేషన్స్ గురించి చెప్పాల్సిన పనిలేదు. టెంప్టింగ్ ఫోటో షూట్లతో ఇన్ స్టాలో దాడి చేయడం నోరా ప్రత్యేకత. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలతో సెగలు రేపుతూనే ఉంది. తాజాగా వైట్ అండ్ వైట్ డిజైనర్ దుస్తుల్లో తళుక్కున మెరిసింది. టాప్ టూ బాటమ్ తెలుపు ఫ్రాకులో నోరా అందాలు వేడెక్కిస్తున్నాయి. ఈ డ్రెస్ లో నోరా ఇన్నర్ అందాలు మత్తెక్కిస్తున్నాయి.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com